# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే నాటికి భారత్ ... అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందని బీజేపీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

- దేశంలో నదుల అనుసంధానానికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని ఆ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు.

- ఎన్నికల నేపధ్యంలో మద్యం, నగదు, బహుమతుల పంపిణీని నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు ఎంఎస్ నీనా నిగం అధికారులను ఆదేశించారు.

- రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల వడగాడ్పులు వీచే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గడచిన దశాబ్ద కాలంగా భారత్ ప్రపంచ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించిందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు గుజరాత్ లోని ఆనంద్, సురేంద్ర నగర్‌లలో జరిగిన ర్యాలీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే నాటికి భారత్ ... అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వివాదాల పరిష్కారం కోసం ప్రపంచం భారత్ వైపు చూస్తోందని పేర్కొన్నారు. గడచిన పదేళ్ళ కాలంలో భారత్ ప్రపంచ స్థాయి ఖ్యాతిని గడించిందని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటింగ్ లో పాల్గొని, ఓటింగ్ శాతంలో గత రికార్డులను అధిగమించాలని ప్రధాని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో నదుల అనుసంధానానికి భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని ఆ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా వెంకటంపేటలో ఎన్డీయే కూటమి అభ్యర్థుల తరఫున ఈరోజు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశ జనాభాలో 90 శాతం మంది పల్లెల్లోనే ఉండేవారని... ప్రస్తుతం 30 శాతం ప్రజలు నగరాలకు వలస పోతున్నారని

అన్నారు. ఈ కారణంగా పల్లెల్లో సాగు చేసే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బయో ఇంధన వినియోగం పెరిగి, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని, దేశం అభివృద్ధి చెందుతుందని వివరించారు. విశాఖపట్నం నుండి రాయపూర్ వరకు 35 వేల కోట్ల రూపాయల ఖర్చుతో హైవే నిర్మాణం జరుగుతున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల వడగాడ్పులు వీచే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో దక్షిణ ఛత్తీస్ ఘడ్ నుండి దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి విస్తరించి ఉందని పేర్కొంది. రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వివరించింది. అదేవిధంగా ఉరుములతో కూడిన మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్లు వేగంతో ఈదురు గాలులు ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బాపట్ల జిల్లా కలెక్టరేట్ లో వ్యయ పర్యవేక్షణ కమిటీ, అనుబంధ విభాగాల అధికారులతో ఈరోజు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు ఎంఎస్ నీనా నిగం మాట్లాడుతూ... ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, బహుమతుల పంపిణీని అరికట్టేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మీడియా సెంటర్, వెబ్ క్యాస్టింగ్, సోషల్ మీడియా, వ్యయ కమిటీ, గ్రీవెన్స్ సెల్ విభాగాలను జిల్లా కలెక్టర్ తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా అధికారులు పనిచేయాలన్నారు. నగదు అక్రమ రవాణా, తరలింపులను అరికట్టడానికి జిల్లా సరిహద్దులలో నియమించిన బృందాలు 24 గంటల పాటు పని చేయాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పోలింగ్ కేంద్రంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని చిత్తూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి షన్మోహన్ వ్యాఖ్యానించారు. ఈరోజు జరిగిన సూక్ష్మ పరిశీలకుల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.... ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా జరిగేలా అధికారులంతా కృషి చేయాలన్నారు. జిల్లాలో 425 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, నిరంతర వీడియోగ్రఫీ ఏర్పాట్లతో పాటు సూక్ష్మ పరిశీలకులను నియమించడం నియమించామని కలెక్టర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మత్స్యకార భరోసా పథకానికి అర్హత గలవారిని ఎంపిక చేసే ప్రక్రియ చేపడుతున్నట్టు శ్రీకాకుళం జిల్లా మత్స్యశాఖ డెప్యూటీ డైరెక్టర్ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... వేట విరామ సమయంలో మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు పేర్కొన్నారు. గత ఏడాది అక్టోబర్ 14 నాటికి నమోదు చేసుకున్న లైసెన్సుడ్ మోటార్ బోట్ మత్స్యకారులు మాత్రమే ఈ పథకానికి అర్హులని స్పష్టం చేశారు. జిల్లాలో సుమారు 183 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, ఫిష్ లాండింగ్ కేంద్రాల వద్ద పథకానికి అర్హులైన వారి వివరాలు సేకరిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యాధి నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. విజయపార్వతి వైద్య సిబ్బందికి సూచించారు. ఈరోజు ఆమె వైద్య ఆరోగ్య కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే వారికి అవసరమైన ల్యాబ్ పరీక్షలు సకాలంలో నిర్వహించి, రోగ నిర్ధారణ చేసి, తగిన చికిత్స అందించాలన్నారు. మలేరియా, డెంగీ తదితర వ్యాధులను గుర్తిస్తే సత్వరమే పై అధికారులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు.

==============================

సి విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులు చర్యలు తీసుకున్నారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నోడల్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సి విజిల్ యాప్ ద్వారా 592 ఫిర్యాదులు రాగా వాటిలో 118 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించినవి కావని ధ్రువీకరించడం జరిగిందన్నారు. మిగిలిన 474 ఫిర్యాదులలో 436 ఫిర్యాదులను 100 నిమిషాల లోపు పరిష్కరించడం జరిగిందని వివరించారు.

==============================

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన చేస్తూ... వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుండి 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన బాలలు... జులై 31 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, సంస్కృతి, సంగీతం, నృత్యం, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర అంశాల్లో ప్రతిభ కనబరచిన బాలలు https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎంపికైన బాలలకు వచ్చే సంవత్సరం జనవరి నెలలో రాష్ట్రపతి చేతులు మీదుగా పురస్కారాలను అందజేస్తారని ఆయన తెలియజేశారు.

==============================

వృద్ధులు, వికలాంగులు పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్ళేందుకు వీలుగా వీల్ చైర్లు అందుబాటులో ఉంటాయని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈరోజు కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని శ్రీకాకుళం పార్లమెంట్ స్థానంతో పాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసేందుకు 1 వెయ్యి 700 వీల్ చైర్లు అందుబాటులో ఉన్నట్టు పేర్కొన్నారు.

==============================

సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవానికి సంబంధించిన గంధం చెక్కల అరగతీత కార్యక్రమం ఈ నెల 4వ తేదీన ప్రారంభం కానున్నట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియ రోజున స్వామి వారి విగ్రహంపై ఉన్న చందనాన్ని తొలగించి నిజరూపాన్ని దర్శించుకునే అవకాశం భక్తులకు కల్పిస్తారని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి సహస్ర ఘటాభిషేకం నిర్వహించిన అనంతరం, స్వామి వారికి చందన సమర్పణ జరుగుతుందన్నారు. అదే విధంగా రెండవ విడత చందన సమర్పణ వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున, మూడవ విడత చందన సమర్పణ జ్యేష్ఠ పౌర్ణమి రోజున నాల్గవ విడత చందన సమర్పణ ఆషాడ పౌర్ణమి రోజున జరుగుతుందని ఈవో తెలియజేశారు.

==============================

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా రేపు పల్నాడు జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలోని పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు గ్రామంలో జరిగే మేమంతా సిద్ధం సభలో ఆయన పాల్గొననున్నారు. కాగా... ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కార్యక్రమం జరగనున్న ప్రాంతాన్ని, హెలీపాడ్

గ్రౌండును జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

==============================

విజయనగరం జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోలింగ్ అధికారుల రెండవ విడత శిక్షణా కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. చీపురుపల్లి, రాజాం లో జరిగిన శిక్షణ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పోలింగ్ నిర్వాహణపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

==============================

==============================